

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ



**కరూన్ క్యా ఆస్ నిరాస్ భయీ, కరూన్‌క్యా ఆస్ నిరాస్ భయీ.**

1939లో వచ్చిన 'దుష్మన్' సినిమాలో సైగల్ పాడిన ఈ పాట తొలి తరం సినీమా పాటలలో పాజిటివ్ దృక్పథం ప్రదర్శిస్తూ, జీవించటం నేర్పించే వ్యక్తిత్వ వికాస పాటగా నిలుస్తుంది. జీవితం పట్ల విరక్తి కలిగి, నిరాశ సముద్రంలో మునిగి, సర్వం త్యజించాలనే తీవ్రమైన నిరాశ పాతాళం నుంచి మనిషిని ఆశా శిఖరాలవైపు నడిపిస్తుందీ పాట. 'దుష్మన్' సినిమా కథ ఇప్పుడు కొత్తగా అనిపించకపోవచ్చు. ఎందుకంటే ఇదే కథ కొద్ది మార్పులతో ఇప్పటికి ఎన్నోమార్లు సినిమాలుగా తీశారు. కానీ ఇలాంటి పాటను మాత్రం ఒక్క తెలుగులో తప్ప మరే భాషలోనూ సృజించలేకపోయారు.

నాయకుడు, నాయిక ప్రేమించుకుంటారు. నాయకుడికి టి.బి అని తెలుస్తుంది. దాంతో నాయకుడు నాయికకు దూరంగా వెళ్ళిపోతాడు. వారిద్దరి కామన్ స్నేహితుడితో నాయిక వివాహం నిశ్చయమవుతుంది. కానీ నాయిక హీరోను మరచిపోలేకపోతుంది. నాయకుడు దూరమయిన వేదనలో నాయిక అనారోగ్యం పాలవుతుంది. ఆ సమయంలో టీబి సానిటోరియం నుంచి రేడియోలో నాయకుడు ఈ ప్రబోధాత్మక, ప్రేరణాత్మక గీతం పాడతాడు. నయం కాదనుకున్న నాయకుడికి టి.బి నయం అవుతుంది. చివరికి స్నేహితుడు త్యాగం చేస్తాడు. ఇలాంటి కథ పలు విభిన్నమైన సినిమాలుగా రూపొందటం మనకు తెలుసు. ఇద్దరు ప్రేమించుకుంటారు. కానీ అనారోగ్యం కారణంగానో, ఇంకే కారణంగానో, ఒకరు కావాలని పక్కకు తప్పుకోవటం, మూడో వ్యక్తి రంగ ప్రవేశం చేయటం అన్న మౌలికమైన అంశానికి ఎన్నో మలుపులు, మెరుపులు జోడించి బోలెడన్ని సినిమాలు తీశారు. పది సినిమాల్లో అయిదారు సినిమాల మౌలిక కథాంశం ఇదే అయి ఉంటుంది. దీన్లో నాయిక కాలు విరిగి, అమె పక్కకు తప్పుకుంటే అది అర్జూ (1965) అవుతుంది.

అనారోగ్యం కారణంతో హీరో పక్కకి తప్పుకోగా, కామన్ స్నేహితుడిని పెళ్లి చేసుకుని, ఆ స్నేహితుడు మరణిస్తే 'సఫర్ ' (1974) అవుతుంది. ఒకడిని ప్రేమించి మరొకడిని ప్రేమిస్తే, ఆ ఇద్దరు స్నేహితుల నడుమ ఈ ప్రేమ వల్ల చిచ్చురగిలితే చౌధవీక చాంద్ ఇలాంటి కథలకు ఒక రూపయితే, మెరే మహెబూబ్ మరో రూపు. అందాజ్, సంగం లు ఇంకో రూపు. ఇలా అనేకానేక రూపాలున్నాయి ఈ కథకు.

ఇలా విశ్లేషిస్తూ పోతే ఎన్నో సినిమాల మూలకథ, 1939లో వచ్చిన 'దుష్మన్' సినిమా అని తేలుతుంది. కానీ ఈ సినిమాల్లో యే సినిమాలో కూడా ఇలా ప్రేరణాత్మకం, ప్రబోధాత్మకమూ అయిన పాటలేదు. ప్రేమ పాటలు బోలెడన్ని ఉన్నయి.

**కలకానిదీ, విలువైనదీ, బ్రతుకు**
**కన్నీటి ధారలలోనే బలి చేయకు**

దాదాపుగా ఒకే రకమైన సన్నివేశం. ఒకే రకమైన భావం. కానీ భావవ్యక్తీకరణ, చెప్పదలచుకున్న అంశాన్ని చెప్పేతీరు మాత్రం పుర్తిగా భిన్నం.

1939లో 'దుష్మన్' సినిమా తయారయ్యే సమయానికి సినిమా ఇంతగా అభివృద్ధి చెందలేదు. అప్పుడప్పుడే 'రేడియో' నిత్య జీవితంలో భాగమవుతోంది. సినిమాల్లో నేపథ్యగానం అభివృద్ధి చెందుతోంది. అయితే, సినిమాలో నటీనటులు, ఎవరి పాటలు వారు పాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అంటే, పాటలు పాడేవారేవరూ గానంలో శిక్షణ పొందినవారు కాదు. గానకళలో ప్రావీణ్యం ఉన్నవారు కారు. కాబట్టి బాణీలు సులభంగా ఉండాలి. నటించే వారికేకాదు. వినేవారికీ సులభంగా అర్ధమవ్వాలి. పండితులూ పామరులూ పాటను అర్ధం చేసుకుని పాడుకునేట్టుండాలి. అంటే, పాటలో కవిత్వం ఉండకూడదు. ఉన్నా అది అతి సులభంగా బోధపడేట్టుండాలి. పరిస్థితిని ఆకళింపు చేసుకుని కేదార్ శర్మ, పాటను ఒక కథలాగా నిర్మించాడు. అత్యంత దుర్భరమైన నిరాశస్థితిని ప్రతిబింబిస్తూ పాటను ప్రారంభించాడు. అప్పటికి సైగల్ విషాదగీతాలకు మారు పేరుగా ఎదుగుతున్నాడు. కాబట్టి ఆయనకు పాడటం సులభం. ప్రేక్షకులు కూడా సైగల్ నుండి విషాద గీతాన్ని సులభంగా స్వీకరిస్తారు. అందుకని పాట ఆరంభం కటిక చీకటిలో, అంతులేని పాతాళంలో ఉన్న వ్యక్తి హృదయ వేదనను ప్రకటిస్తూ ఆరంభమవుతుంది 'ఏం చేయాలి? ఆశ నిరాశ అయిపోయింది' అంటూ ఆరంభమవుతుంది పాట. 'ఆశ నిరాశ అవటం' ఎంత దుర్భరమైన వేదనకు దారితీస్తుందో అది సైగల్ స్వరం పలుకుతుంది. 'కరూన్ క్యా ఆస్ నిరాస్ భయీ' అనటం పదాలకు తీవ్రతను ఆపాదిస్తుంది. దుర్భరమైన వేదనను అనుభవిస్తూ, తీవ్రమైన నిరాశలోకి దిగజారుతున్న మనిషి హృదయపు ఆక్రందనలా ధ్వనిస్తుంది. 'ఏం చేయాలి ఆశ నిరాశ అయింది. అనటంలోనే సర్వం కోల్పోయిన భావన, ఆ పదాలను సైగల్ పలకటంలో ధ్వనిస్తుంది. పాటకు ప్రాణం పోయటం అంటే ఇది. గాయకుడు, ఆ తీవ్ర నిరాశను, ఆ చిక్కటి చీకటిని తన హృదయంలో నింపుకుని, తాను అనుభవిస్తూ పాడితే, శబ్దతరంగాలు అతని హృదయ లోతుల్లోంచి వెలికివస్తూ, ఆ చీకటిని, ఆ నిరాశను తమతో మోసుకు వచ్చి, బహిర్గతమయ్యే సమయంలో తామే ఆ నిరాశ, చిక్కటి చీకటి అవటం సైగల్ స్వరం నుండి వెలువడే నిరాశలో కూరుకుని పోయిన వేదనా శబ్దతరంగాల ద్వారా అనుభవించవచ్చు. పాటలో భావం తానే అయిపాడటం సైగల్ పాడిన

ప్రతిపాటలో కనిపిస్తుంది. కానీ విషాద గీతాల్లో ఇది ఎక్కువ కనిపిస్తుంది అందుకే కేదారశర్మ ముందుగా విషాదం పలికించి ఆకర్షించాడు. ఆపై 'తమసోమా జ్యోతిర్గమయ' అన్నట్టు చీకటి నుంచి వెలుతురు వైపు నడిపించాడు.

**దియా బుఝే ఫిర్ సే జల్‌జాయే**

**రాత్ అంధేరి జాయే దిన్ అయే**

**మిట్ తి ఆస్ హై జ్యోతి అఖియన్ కీ**

**సంఝో గయీ తో గయీ**

**కరూన్ క్యా ఆస్ నిరాస్ భయీ...**

చిన్న చిన్న పదాలలోనే, గొప్ప సత్యం ఇమిడ్చాడు కేదారశర్మ. ఆ కాలంలో ఇంతగా అక్షరాస్యత లేదు. కాబట్టి అందరికీ అర్థమవ్వాలంటే పదాలు అందరికీ తెలిసినవయి ఉండాలి. కఠినమైన పదాలు, ఆడంబరమైన పదాలు అవసరంలేదు. కేదార శర్మ శుద్ధ హిందీ పదాలు వాడే కవి. ఆయన స్క్రిప్టు రచయిత కూడా. సంభాషణలూ రాస్తాడు. ఆ అనుభవం ఆయనకు పాటలలో మాటలను కూర్చి మాటలను పాటలుగా మలచే శక్తినిచ్చింది. దీపం ఆరిపోతే తిరిగి వెలిగించవచ్చు. చీకటి తరువాత వెలుగు వస్తుంది. కానీ ఆశ అన్నది కళ్లల్లో జ్యోతిలాంటిది. అది నశిస్తే అంతా పోయినట్టే. అది మళ్లీ తిరిగి రాదు. 'మిట్ తి ఆస్ హై జ్యోతి అభియన్‌కీ, స అఖియన్ కీ

**సంఝో గయీ తో గయీ**

' అన్న నా వాక్యాలు అత్యద్భుతం. ఈ ప్రపంచంలో ప్రతి జీవి రేపటి ఆశతో జీవిస్తుంది. ఈ రాత్రి తెల్లవారుతుంది. తెల్లవారితే సమస్యలు పరిష్కారమవుతాయన్న ఆశని జీవిని ముందుకు నడిపిస్తుంది. ఆశలేకపోతే సర్వం అయిపోయినట్టే. కంటిలో జ్యోతి ఆరిపోవటం, ఆశ అన్నది లేకపోవటం ఒకటే. అంటే ఆశ అన్నది లేకపోవటం మరణ సదృశం. అందుకే ఓ కవి ప్రతి రోజూ ఒక నూతన స్వప్నాన్ని సృజించాలి అంటాడు. ఒక స్వప్నం పోతే మరో స్వప్నం సృజించుకుని దానివైపు పరుగిలిడాలి. ఎపుడయితే కలలుండవో, అప్పుడు జీవితం లేదు. కలలే మన ఆశలు. 'కలలే మనకు మిగిలిపోవు కలిమి చివరకు అంటాడు 'ఆత్రేయ'. అందుకే ఆశను కంటి వెలుగుతో పోల్చాడు కేదారశర్మ. ఆశపోతే కంటి వెలుగు పోయినట్టే. ఆ పోయింది తిరిగి రాదు . కానీ ఏం చేయాలి నా ఆశ నిరాశ అయింది' అంటున్నాడు సైగల్.

కేదారశర్మకు భిన్నంగా శ్రీ శ్రీ ఆరంభం నుంచే స్ఫూర్తినిచ్చే భావంతో జీవిత సత్యం చెప్తూ పాటను ఆరంభించాడు. శ్రీశ్రీ వాడిన పదాలు కూడా సరళమైనవి. సులభంగా అర్థమయ్యేవి. 'జీవితం కలకాదు' అనటంలో బోలెడంత ఆలోచన ఉంది. 'మాయంటావూ మిధ్యంటావూ?' అన్న ప్రశ్న పొడిగింపు 'కలకానిదీ అన్న వాక్యం '. భారతీయ వేదాంతం ఈ ప్రపంచం ఒక మాయ, మిథ్య అంటుంది. ఇదొక కలలాంటిది. మేల్కొంటే కల అదృశ్యమై, అసలు నిజం తెలుస్తుంది అంటుంది. మేల్కొనటం అంటే అసలయిన జ్ఞానాన్ని పొందటం. అయితే, ఈ ప్రపంచం 'కల' అనటాన్ని, 'మిధ్య'

అనటాన్ని మేధావులు నిరసిస్తారు. ఇది పలాయన వాదం అంటారు. దాన్ని ఖండిస్తారు. శ్రీశ్రీ 'కలకానిది, విలువైనది' అన్న వాక్యం వెనుక ఈ మిధ్యా వాదాన్ని ఖండిస్తూ, జీవితం సత్యం. దీన్ని వ్యర్థం చేసుకోకూడదు అన్న సందేశం ఉంది. సినిమా సందర్భాన్ని అనుసరించి 'బ్రతుకూ కన్నీటి ధారలలో బలిచేయకు  అనటం.

**'హం కహెతె హై యే జగ్ అప్‌నాహై**

**తుం కహతె హో ఝూటా సప్నా హై**

ఇది చిత్రలేఖ సినిమాలో సాహిర్ లూధియాన్వీ మిధ్యావాదంపై వేసిన బాణం. చిత్రలేఖ సినిమాలో అశోక్ కుమార్

మిధ్యావాది , ఈ ప్రపంచం అంతా మిధ్య అంటాడు. మీనాకుమారి పాత్ర నర్తకి. ఆమె అతడిని రెచ్చగిడుతూ పాడే పాట ఇది.

'సంసార్ సె భాగే ఫిర్ తే హో, భగ్ వాన్ కొ తుమ్ క్యా పావోగే'  అంటుంది నాయిక.

'ప్రపంచాన్ని వదిలి పారిపోతున్నావు. భగవంతుడిని ఏం పొందుతావు?' అని హేళన చేస్తోంది.

మేము ఈ ప్రపంచాన్ని నిజంగా భావిస్తాము. దీన్ని మా ప్రపంచంగా భావించి స్వీకరిస్తాం అనుభవిస్తాం. నువ్వది అబద్ధం, మాయ, కల అంటావు. ఈ ప్రపంచం భగవంతుడి రచన అయితే, ఆ రచనను తిరస్కరించటాన్ని మించి రచయితకు అవమానం ఏముంది? 'ప్రపంచం అబద్ధం అని త్యజిస్తున్న నువ్వు భగవంతుడిని ఎలా పొందుతావు?' అని ప్రశ్నిస్తోంది నాయిక సన్యాసిని.

సినిమా ఆరంభమైన కాలంలో  దేశభక్తి తప్ప మరో వాదం లేదు సినిమాల్లో. కానీ బ్రిటీష్ వారి పాలనలో దేశం ఉండటంతో, 'దేశభక్తి ' అన్న భావనను మార్మికంగా, బ్రిటీష్ వారి కన్నుగప్పి సినిమాలో ప్రదర్శించాల్సి వచ్చేది. కాబట్టి ఆ కాలం పాటలలో ఇజాలు, వాదాలు, సిద్ధాంతాలు కనిపించవు. స్వచ్ఛమైన సినిమా పాటలివి. తరువాత కాలంలో ఇజాలు, వాదాలు, సిద్ధాంతాలతో కళాకార్లు సినిమాల్లో ప్రవేశించారు. అవకాశం దొరికినప్పుడల్లా తమ వాదాలను, సిద్ధాంతాలను సినీసందర్భ పరిధిలో ఒదిగి పాటల్లో ప్రదర్శించారు సాహిర్ అయినా, శ్రీశ్రీ అయినా.

**జబ్ న కిసీనే రాహ సుఝాయీ**

**దిల్ సె ఎక్ ఆవాజ్, యె ఆయీ**

**హిమ్మత్ బంధ్ సంభల్ బడ్ ఆగే, రోక్ నహీ హై కోయీ**

**కహో న ఆస్ నిరాస భయీ, కహోన ఆస్ నిరాస్ భయీ.**

చీకటి నుంచి వెలుతురు వైపుకు నడిపిస్తున్నాడు. దారి తెలియని పరిస్థితి. నిరాశలో మ్రగ్గి ఉన్నప్పుడు ఎవ్వరూ సహాయానికి రావటంలేదు. దారి చూపేవారు ఎవ్వరూ లేరు. దిక్కుతోచని పరిస్థితి అది. అలాంటప్పుడు హృదయంలోంచే మార్గదర్శనం జరుగుతుంది.'ఉద్దరేత్  ఆత్మనాత్మనం' అంటుంది భగవద్గీత. ఎవరో వస్తారని, 'ఏదో చేస్తారని' ఎదురు

చూడవద్దంటాడు శ్రీశ్రీ. ఎవ్వరూ, ఎలాంటి సహాయం లేనప్పుడు, ఎలాంటి ఆశలేనప్పుడు తనలోకి చూసుకోమంటున్నాడు కేదారశర్మ. మార్గదర్శనం లోనుంచే వస్తుంది. తనకు తాను ధైర్యం చెప్పుకోవాలి. 'నీళ్లులేని ఎడారిలో కన్నీళ్లయినా తాగి బ్రతకాలి/ ఏ తోడూ లేనినాడూ నీ నీడే నీకు తోడు' అంటాడు సినారే , 'గోరంతదీపం కొండంత వెలుగు / చిగురంత ఆశ జగమంత వెలుగు' అనే పాటలో.

కేదారశర్మ 'దిల్ సె ఎక్ ఆవాజ్' అనటంలో అర్థం వ్యక్తిలో అన్నిటినీ తట్టుకుని ముందుకు సాగేశక్తి ఉంటుంది. వ్యక్తి ఆ శక్తిని గుర్తించాలి. పట్టుదలతో, ధైర్యంతో ముందుకు సాగితే 'రోక్ నహీ హై కోయీ' ఎలాంటి అడ్డంకి లేదు. ఎవరూ ఆపలేరు. అంటే, ఎవరో సహాయం చేస్తే, కలిగే ధైర్యం అసలు ధైర్యం కాదు. అది తాత్కాలికం. ఆ సహాయం తొలిగిపోతే మళ్లీ పరిస్థితి మొదటికి వస్తుంది. కాబట్టి ఎవరినుంచీ ఏమీ ఆశించకుండా, వ్యక్తి స్వశక్తి పై ఆధారపడాలి. స్వశక్తిని మించిన శక్తి ఈ ప్రపంచంలో మరొకటి లేదు. మనిషి తలచుకుంటే సాధించలేనిది లేదు.

**దివిజ గంగ భువికి దింపిన భగీరధుడు మానవుడే**
**సుస్థిర తారగ మారిన ధ్రువుడు కూడ మానవుడే**
**సృష్టికి ప్రతి సృష్టి చేయు విశ్వామిత్రుడు నరుడే**
**జీవకోటి సర్వములో శ్రేష్టతముడు మానవుడే**
**మానవుడే మహనీయుడు, మానవుడే మాన నీయుడు**
**శక్తియుతుడు, యుక్తి పరుడు మానవుడే మహనీయుడు**

మనిషి తలచుకుంటే అసాధ్యమన్నది లేదంటున్నాడు ఆరుద్ర. ఉదహరణలు కూడా చూపిస్తున్నాడు. వ్యక్తి స్వతసిద్ధంగా తనలో నివిడీకృతమై ఉన్న శక్తిని గుర్తించి, ప్రకటించటం వల్లనే ఇది సాధ్యమయ్యాయి. ఒక సిద్ధాంతం ప్రకారం ప్రతివ్యక్తిలో అనంతమైన శక్తి దాగి ఉంటుంది. ఆ వ్యక్తి ఏ విషయంపై దృష్టిని కేంద్రీకరిస్తే ఆ విషయంలో వ్యక్తి నిష్ణాతుడవుతాడు. ఈ శక్తి గుర్తించక వ్యర్థం చేసుకుంటే, ఆ వ్యక్తి జీవితం నిరర్ధకం అవుతుంది. కాబట్టి తన శక్తిని గుర్తించటం అత్యంత కీలకం. తన శక్తిని గుర్తించిన వ్యక్తి ఎలాంటి నిరాశా పాతాళం నుంచయినా వెలికి వచ్చి ఆశాశిఖరాలనధిరోహించి విజయం సాధిస్తాడు.

**అగాధమౌ జలనిధిలోనా ఆణిముత్యమున్నటులే**
**శోకాలమరుగున దాగీ సుఖమున్నదిలే**
**ఏదీ తనంతతానై నీదరికి రాదూ**
**శోధించి సాధించాలి అదియే ధీరగుణం**

వ్యక్తి తన శక్తిని గుర్తించాలంటే అందుకు ప్రయత్నించాలి. ప్రయత్నించకుండా నా ప్రాణాలు తొలిగిపోవాలి. చీకట్లు పోయి వెలుగులొచ్చేయాలంటే కుదరదు.

ఏదీ తనంత తానై నీ దరికి రాదోయ్', 'హిమ్మత్ బంధ్ సంభల్ బడ్ ఆగే' నిరాశలో మ్రగ్గిపోయే బదులు వ్యక్తి ఆ నిరాశను జయించేందుకు ప్రయత్నించాలి. అందుకు ప్రేరణ అతనినించే రావాలి.

**గాలివీచి పూవులతీగ నేలవాలిపోగా**

**జాలివీడి అటులే దాని వదలివైతువా**

**చేరదీసి నీరుపోసి చిగురించనీయవా**

ఎంతో సున్నితమైన ఉదాహరణతో 'ప్రయత్నం' గురించి చెప్తున్నాడు గేయ రచయిత.

పూలతీగ పడిపోయిందని ఏడుస్తూ కూచుంటే అది మళ్ళీ చిగురించదు. పైగా చస్తుంది. కాబట్టి, దాన్ని నిలబెట్టాలి. నీళ్లు పోయాలి. పూలతీగ అయినా, మనిషి జీవితం అయినా ప్రయత్నిస్తేనే ఏదైనా లభిస్తుంది. ఉట్టిగా కూర్చుని వారినీ వీరినీ విమర్శిస్తూ, దూషిస్తూ, తన దుస్థితిని వేరే ఎవరినో బాధ్యులను చేస్తూ, తన ప్రయత్న లోపానికి నేరం ఎవరిపైనో నెట్టేస్తూంటే సాధించేదేమీ లేదు. పరిస్థితి మరింత దిగజారటం తప్ప.

**కర్‌నా హోగా ఖూన్ కి పానీ,**

**దేనా హోగా హర్ కుర్బానీ,**

**హిమ్మత్ హై తూ ఇత్నీతో సమఝ్లే**

**ఆస్ బంధేగి నయీ**

**కహో న ఆస్ నిరాస భయీ..**

**అలముకొన్న చీకటిలోనే అలమటించనేలా**

**కలతలకే లొంగీపోయీ కలవరించనేలా**

**సాహసమను జ్యోతినీ చేకొనీ సాగిపో**

ఇదీ పాటంటే, ఇదీ గేయ రచన అంటే. నిరాశ చీకట్లోంచి దశల వెలుగులోకి రావాలంటే ముందు స్వశక్తిని గుర్తించాలి. స్వశక్తిని గుర్తిస్తే కానీ లాభంలేదు. 'కర్‌నా హోగా ఖూన్ కపానీ' అంటే రక్తాన్ని నీటిగా చేయటం కాదు. చెమటోడ్చి కష్టపడటం. రక్తాని నీటిలాగా ప్రవహింపచేయాలి. అంటే అంత కష్టపడాలి. భూమినీ అకాశాన్ని ఏకం చేయటం లాంటిది ఇది. అన్నీ త్యాగం చేయాలి. దారి తప్పించే ఏ ఆకర్షణకూ లొంగకూడదు. తప్పుదారి పట్టించే ఆకర్షణలన్నీటినీ త్యజించాలి.

'ధైర్యం' 'ఆత్మవిశ్వాసం' అన్నిటికన్నా ప్రాధాన్యం.

సాహసమను జ్యోతినీ చేకొనీ సాగిపో

'ఆత్మవిశ్వాసం' ఉంటే చాలు నిరాశ ఆశలాగా మారిపోతుంది. పోతే నిరాశ స్థానంలో కొత్త ఆశ జనిపిస్తుంది. కాబట్టి ఆశ నిరాశ అయిందని అనకు. ఆశ నిరాశ అయిందని అనవద్దు. 'ఆత్మవిశ్వాసం ' ప్రాధాన్యాన్ని అత్యద్భుతంగా ప్రదర్శిస్తాయీ పాటలు.

ఆ కాలంలో టీబీ వస్తే మరణం అనివార్యం. వారందరికీ 'ఆశ' నిచ్చేందుకు పాడే ఈ పాట, నిత్యజీవితంలో ప్రేరణ నిచ్చి, ఆత్మవిశ్వాసాన్నిచ్చి మనిషిని ముందుకు నడిపించే శక్తిగలది. చీకటి నుంచి వెలుతురు వైపు, అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు నడిపించే శక్తిగలదీపాట. ఆత్మ విశ్వాసం ఉంటే మనిషి ఓటమిని ఒప్పుకోడు. నిరాశలో ముగ్గిపోడు. ఒక కల చెదిరితే మరో కొత్తకల కంటాడు. ఒక పరాజయంతో ఆగిపోడు . పరాజయాన్ని విజయానికి మెట్లుగా మార్చుకుంటాడు. ఇదంతా సాధ్యం కావాలంటే మనిషికి ఉండాల్సింది ఆత్మ విశ్వాసం. ఎవరో వచ్చి సహాయం చేయాలని, ఎవరో ఉద్ధరించాలని ఎవరో ఏదో చేయాలని ఎదురు చూడటం ఆత్మ విశ్వాస రాహిత్యానికి నిదర్శన. చేతకాని తనానికి నిదర్శనం

ఇదీ 1939లో కేదార్ శర్మ రచించగా, పంకజ్ మల్లిక్ అతి సుందరంగా బాణీ సృజించగా సైగల్ పాడిన అత్యంత ప్రేరణాత్మకమైన గీతం. కానీ స్వాత్రంత్యం వచ్చిన తరువాత ఈ 'ఆత్మ విశ్వాసం' ప్రసక్తి కనబడకపోవటం అత్యంత బాధాకరమైన అంశం. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా, ఇంకా ఉచితాలపై ఆధారపడి, ఆశపడే అనుచితమైన దురాశాపూరిత ప్రవర్తనకి అడుగడుగునా కనిపిస్తోంది. ప్రతి విషయంలో 'ఎవరో వస్తారని, ఏదో చేస్తారని' ఎదురు చూడటం, ఆశించటం కనిపిస్తోంది. 'ఉచితమే ఉచితం ' అన్న నిరాశ నిస్పృహల ఆత్మవిశ్వాస రాహిత్యం కనిపిస్తోంది.

కనీసం ఈ అమృతోత్సవం నుంచయినా ప్రతి ఒక్కరూ 'కహో న ఆస్ నిరాస్ భయీ' అంటూ అడుగడుగునా ఎవరికీ తలవంచకు/ఎవరినీ యాచించకు/గుండె బలమే నీ ఆయుధం/ నిండుమనసే నీ ధనం, అనే ఆత్మస్థయిర్యాన్ని, ఆత్మ గౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించాలనుకుందాం.

అందరికీ 75వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

**వందేమాతరమ్!**

**భారత్ మాతాకీ జై॥**

(మరిన్ని పాటలు వచ్చే నెలలో)

Post your comments